"నల్లంగ సవుద్రం మింద మబ్బు జూడు కమ్ముకోనొస్తా వుండాది. యింకొంచేపు తాలితే కుమ్మరించి పోసెయ్యబోతాది వాన. యింకిప్పడేం బోతావుగానీ, మీ వొదిన రొయ్యిలు యేంచిపెట్టుండాది తినేసి గమ్మున పొణుకోబో. పొద్దున లేసి పోవచ్చు."

– మా అమ్మ యీ మాటలు నాతో అనడం యిది రెండోసారి. ఆమె మాటల్లో ధ్వనిస్తున్న విసుగు నా చెవిన బడినా యీసారి కూడా నేను జవాబివ్వలేదు. నేను దృష్టి నిలిపిన దృశ్యం చెదిరిపోతుందేమో అని నా భయం.

కిటికీ వెనుక కొబ్బరాకు మీద వాలిన మిడతను మింగడానికి మరబొమ్మ లాగా కదులు

# మొగుడూ పెళ్లాల ప్రేమకత

## ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు

తున్న తొండని చూస్తున్నాను. దాని ప్రతి కదలికలోనూ యెంతో మెళకువ కనిపిస్తోంది. అడుగు ముందుకు వేసిన ప్రతిసారీ నిశ్చలంగా మరబొమ్మలా నిలబడి పరిస్థితిని అంచనా వేసుకుంటోంది అది. తనని సమీపిస్తున్న తొండనే మిడత యేకాగ్ర దృష్టితో చూస్తోంది. కదలదూ బెదరదు. అది ప్రమాదాన్ని పసిగట్టలేదా లేక ఆశపెట్టినంతసేపు ఆశపెట్టి ఆఖరి క్షణాన యెగిరిపోయే చతురమైన యెత్తుగడా?! తొండకీ బహుశా యిదే అనుమానం కలిగిందేమో అది యీసారి తల పైకీ కిందికీ వూపుతూ వేట తన వునికిని గుర్తించిందా లేదా అని పరీక్షిస్తోంది. మిడత మెదలకుండా వుంది. తొండ వేగంగా కొంత ముందుకు జరజరా పాకి నిలబడింది. యింక వొకే వొక్క అంగ చాలు, మిడతను నోట కరచుకోవడానికి. మిడత మిడిగుడ్లేసుకుని తొండనే చూస్తూ వుంది. తొండ శరీరాన్ని వెనక్కి వంచింది. మిడతలో కదలిక లేదు. నా గుండె వేగం పెరిగింది. రెప్పవాల్చకుండా చూస్తున్నాను.

"ఆ అనవూ వూ అనవూ యేందట్ట మన్నారసామి యిగ్రహం మాదిరిగా నిలబడుకోనుండావు" అని మా అమ్మ కొనసాగించబోయింది. చూపును కొంచెమయినా పక్కకి తిప్పకుండానే చేతిసైగతో ఆమెను మాట్లాడద్దన్నట్టుగా వారించాను.




CHANDRA

విల్లును వదిలిన బాణంలాగా తొండ మిడత మీదకి దూకింది. సరిగ్గా అదే క్షణంలో విని పించిన వొక వెర్రి అరుపు తొండనీ నన్నూ కూడా కలవరపరిచింది. తొండ దబ్బున నేలమీద పడిపోయింది. మిడత తొండ నోటికి దొరికిపో యిందో లేక తప్పించుకుని ఎగిరిపోయిందో నాకు కనిపించలేదు.

గంగనా గోలగా అరుస్తూ వొక ఆడమనిషి రోడ్డవతల సాలలోంచి బయటకొచ్చి పడింది.

"వోయంవ్వో... కొట్టి చంపేస్తా వుండాడ్రా నా యమ్మో" –యేడుపూ కోపమూ అసహాయతా కలగలసిన బొంగురు గొంతు.

ఆమె లేచి నిలబడింది. చీరకి అంటిన యెర్రదుమ్మును దులుపుకోలేదు. యెదమీదనుంచి జారిపోయిన పైటను పట్టించుకోలేదు. వూడిన జుట్టును మాత్రం ముడేసుకునింది. వొంగి రెండు పిడికిళ్ళలోకీ మట్టిని జవురుకునింది. చేతులు పైకెత్తి మట్టిని నేలకి జారవిడుస్తూ తిట్లు ప్రారం భించింది.

"నా బట్టా నీకు వాంతీ బేదీ తగల. నీ కాళ్ళల్లో వుండుబడ. నిన్ను పెద్ద రోగం యెత్తకబోను. నిన్ను మశానంలో బెట్ట. నిన్ను గోసి పోలేరమ్మకి పోగులుబెట్ట. తిని అరువుగా పాణుకోకుండా నా యెగాన బడి సంపతా వుండావు గదరా నా కొడకా..."

మా అమ్మ నా పక్కన వచ్చి నిలబడి కిటికీలోంచి బయటకు చూస్తూ అనింది–

"దినమ్మా యిదే బోగాతం గదా యీ మొగుడూ పెళ్ళాలది. ఆ యెదవ ఆ యమ్మని బతికి బట్టగట్ట నీబోతాడా. పొగులూ రేత్రీ కష్టంజేసి కడుపుకింత పెడతా వుండాదే పిండాకూడు. తిని పడుంటే యేమి. సంపతా వుంటాడు యేబ్రాసి యెదవ."

"యీ రోజింకా లేదే అనుకుంటా వుండా, మొదులైందా సినిమా" అంటూ వంటింట్లోంచి వస్తూ అనింది మా వదిన.

"యింటీదిలో వొక్క మొగోడూ లేడు గదా ఆ యెదవని నాలుగు తగిలించేదానికి. అవ్వడన్నా బుద్దొచ్చును ఆ ముండమోపోడికి" – మా అమ్మ మాటలనిండా అతనిపట్ల కోపం అసహ్యం వున్నాయి.

"యెవురు బోతారు ఆ వోటికా. మొన్నొక దివం యిట్నే ఆ యమ్మని కొట్టి చంపతా వుంటే కళ్ళ జూళ్ళేక అగ్గో– ఆ మువగ చెట్టుండే యింట్లో కొత్తగా చేరిన అయ్యోరు అడ్డాం బొయివాడా. అనేక జూడు కత. సందాల ఆ అయ్యోరింటి మిందకి బొయ్యి యేం కూతలు కూసినాడనీ! అయి మాటలా. ఆకరికి ఆ యమ్మకీ అయ్యోరికీ సమందం గట్టి యీదిలోకి యీడ్చినాడే. యింకె వురు బోతారు ఆ యెదవ నోటికి! యెవురికి బట్టింది జలదారి గుంట్లో రాయేసేదానికి" అని మా వదిన యెంతో వుక్రోషంతో అనింది. ఆ మాట అనేసి ఆమె విసవిసా వంటింట్లోకి వెళ్ళిపోయింది.

నేను వాకిట్లోకి నడిచి తిన్నెమీద కూర్చున్నాను.

"మూరుడు పొడుగు పొడుచుకో వొస్తావుం డాదే రోషం" అని గొణుగుతూ మా అమ్మ నా వెనకే బయటకు వచ్చింది.

"ఆ యమ్మని గుర్తుపట్టినావంట్రా" అని అడి గింది మొత్తని అనుకుని కింద కూర్చుంటూ.

యెవురన్నట్టుగా చూశాను ఆమెవైపు.

"యిజియా గదా. లొక్కిది యిజియా" అనింది.

"సోంబావ భార్యా" అని దిగ్భ్రాంతితో తల పక్కకి తిప్పి సాలవైపు చూశాను.

సాల ముందు యే అలికిడీ లేదు.

* * *

"అకా రేపొకతూరి మా యిజియాతో గూడా పేటదాకా పొయిరావాల" అన్నాడు మా సోంబావ బెంచీమీద నా పక్కనే కూర్చుంటూ.

కుట్టు పూర్తయిన యిస్తరాకుని గుండ్రంగా కత్తిరిస్తూ మా అమ్మ పని ఆపకుండానే యెందుక న్నట్టుగా కళ్ళెత్తి చూసింది.

"నిన్న అక్కంపేటకి బొయ్యి రంగమ్మని పిలిసే సొచ్చినా సుక్కసారి బెట్టించుకోని పొదువుగానీ రా చెల్లా అని. రేవు సందేళ కంతా దిగెయ్యబోతాది. మూర్రూపాయిలు బొయినా మంచి కోక బెట్టా లకా" అన్నాడు నా లెక్కల నోటు పుస్తకంలోకి తొంగిచూస్తూ.

"అట్నే గానీ లేరా. నేను గూడా బందారాకులు కొనుక్కొచ్చుకోవాల. రేవు శంకుబడ్డానే బైదేలి పోతాంలే" అనింది మా అమ్మ. యిస్తరాకుని తిరగల రాయికింద వత్తుకి పెడుతూ.

యింతలో విజయమ్మ వచ్చి పందిటి గుంజని ఆనుకుని కింద కూర్చునింది.

"మే యిజియా రేవు శంకుబట్టేయాళకంతా పవవజేసుకుని రెడీగా రా" అనింది మా అమ్మ కుట్టాల్సిన ఆకులు కొన్ని విజయమ్మ ముందుకి తోస్తూ.

విజయమ్మ బుగ్గ నిండుకీ ఎవ్వడూ వక్కాకు వుంటుంది. చూవుడు వేలినీ నడుమ వేలినీ యెడం చేసి పెదాల ముందు ఆనించుకుని తువూమని వాకిట్లోకి వూసింది. అరచేత్తో పెదాలు తుడుచుకు నింది. యెడమ కాలు ముడుచుకుని కుడికాలు బారచావుకుని ఆకులు చేతికి తీసుకునింది.

"బిన్నా వొచ్చెయ్యాలకా" అనింది.

మా అమ్మ ఆమె మాటని పట్టించుకోకుండా సోంబావ వైపు తిరిగి– "రే సోమయ్యా... నాకూ వుండారు ముగ్గురు అన్నదమ్ముళ్ళు గుండ్రాయిలు మాదిరిగా. యేమిటికా? వొక సారె యెరుగుదునా, వొగ సాంగెం యెరుగుదునా? వొకనాడన్నా– నా యింటిదాకా వొచ్చిపోకా అని పిలిచి యింత రైగుడ్డ బెట్టునా? అనుకుంటే పొట్ట పేగులు పెళ్ళుకోనొస్తాయి" అనింది బాధగా.

"చినమ్మా వొకరు బెట్టలేదని బాదలా. వొక కడుపున బుట్టకపొయినా యీన మాత్రం నీ అన్న దమ్ముడు గాదా. నీకన్నా యెవురుండారు మాకు మంచీ సెబ్బరకీ. మా యింటికి రా. మంచి వుల్‌వాయిలు కోక బెడ్తా" అనింది విజయమ్మ వెంటనే.

"అవునకా" అన్నాడు మా సోంబావ.

"ఆ మాటన్నావు చాల్లేరా" అనింది మా అమ్మ యెడం భుజం మీది పైటను కొంచెం లాగి కళ్లు తుడుచుకుంటూ.

నాకు లెక్కల మీద మనసు నిలవడం లేదు. పుస్తకం మూసి సంచిలో పెట్టేశాను.

మరుసటిరోజు బడి వదిలి యింటికి వచ్చేవ్వటికి నేను వూహించినట్టు యిల్లు బీగం వేసి లేదు. చిలుకు పెట్టి వుంది. మా అమ్మని వెతుక్కుంటూ మా సోంబావ వాళ్ళింటికి వెళ్ళాను.

వీధి తడిక తీసేవుంది. తాటాకు పందిరి కింద నులక మంచంపైన మా సోంబావ ముడుచుకుని పడుకుని వున్నాడు. మా అమ్మ తిన్నెమీద కూర్చుని వుంది. తిన్నెని ఆనుకుని నేలమీద విజయమ్మ కూర్చుని వుంది.

పేనుగ లేసిన యిల్లు మాదిరిగా వుంది అక్కడి వాతావరణం. సంకోచంగా నడిచి మా అమ్మ పక్కన వెళ్ళి నిలబడ్డాను. ఆమె నావైపు వొకసారి



చూసి లేచి మా సోంబావ పడుకుని వున్న మంచం దగ్గరకు వెళ్ళి మంచం పట్టిమీద కూర్చునింది.

"రే సోంగా... మొగోడివి అట్ట జంకిపోతే యెట్ట. బతుకన్నాక కష్టం సుకం రెండూ వుంటాయి. బాదలొచ్చినవుడు బేలబడిపోతే యెట్ట. తట్టుకోని లేసి నిలబడి సమాళించుకోవాల. నాల్గువాళ్ళు తాళితే మిల్లు తెరవకుండా బోరు. యింతలేకే ఆకాసెం నెత్తిమింద కూలిపాయినట్టు యేందిదా? శెట్టికి మాత్రం కడువు లేదా. పెగ్గికి బొయ్యి మిల్లు మూసుకున్నాడు గానీ, మిల్లుమూసుకోని కడువుకేం తింటాడు. రేపో మాపో మళ్ళీ తెరవరా యేంది. యీ మద్దెన అప్పో సొప్పో జేసి రాయో రప్పో మోసి యెట్నో వొకట్ట బతకాల గదా" అని అనునయంగా చెప్పింది.

"య్యో.. యేందిదా... మొగుడు జచ్చిన ఆడిదాని మాదిరిగా. సాలుగాని లెయి. యిది వూరా అడివా. అందురూ బతికినట్టే మనం గూడా బతకబోతాం గానీ లెయి. పని వూడ్సింది నీ వొక్కిడికేనా యేంది. నీతోపాటే మిగిల్నోళ్లం దురూ యేడస్తా మూల పాణుకోనుండారా, లేసి కాలుమొకం కడుక్కో. అక్కంపేటనుండి మీ చెల్లి వొచ్చెయ్యబోతాది, సుక్కసారి బెట్టించుకునేదానికి. యీ తూరికి మా గ్గలిగింది యింతేమా అని రైగ్గుడ్డ బెట్టి అంపిచేస్తాం గానీ లెయ్యి" అని విజయమ్మ సోం బావ భుజం పట్టుకుని లేవదీసింది.

"రే.. యిజియా జూడా యెట్ట దిటువుగా వుండాదో. లేసి కోనేటికట్ట మిందికి బొయ్యి యిన్ని టీనీళ్ళు తాగేసి రా బో" అనింది మా అమ్మ అక్కడనుంచి బయటకు కదులుతూ.

నా చెయ్యి పట్టుకుని "బడొదల్తానే మొకం కాళ్లు కడుక్కోని యింట్లో వుంటే యేమి. గుద్దెనకాల్నే రావాల్నా" అనింది.

* * *

మా సోంబావకీ వహకూ చుట్టరికం యేదీ లేదు. వరుసలు కలువుకోవడానికి మా వూళ్ళో మాకు కులాలూ కుటుంబాలూ అవసరం లేదు. మా సోంబావకి యేటి కవతల కాటన్ మిల్లులో పని. ఫిట్టరు. మంచి పనోడని పేరు. మా సోంబావ స్పానరు పడితే యెంతెత్తు మిషనయినా కుక్కపిల్ల మాదిరిగా మాటినాల్సిందే. అందుకే మిల్లులో మా సోంబావకి మంచి మతింపు. మిల్లు యజమాని శెట్టియార్‌ది కోయంబత్తూరు. ఆ వూళ్ళోనూ ఆయనకి వొక కాటన్ మిల్లు వుంది. అక్కడ మిషన్లు యెప్పుడయినా మొరా యిస్తే అగమేఘాల మీద మా సోంబావని కారులో యెక్కించుకుని కోయంబత్తూరుకి తీసుకువెళ్తారు. "సోముడి కేమబ్బా కోయంబత్తూరు శెట్టంతటోడే నెత్తిన బెట్టుకోనుండాడు" అనేవాళ్ళు మా వూళ్ళో. నల్లటి తలవెంట్రుకలను కమ్మేసిన తెల్లటి దూది ధూళితో డ్యూటీ దిగి చెల్లెమ్మ యేటిగుండా వూళ్ళోకి నడిచేవుడు చూడాలి మా సోంబావని! పని అలసటకన్నా మిల్లులో పనిచేస్తున్నాననే గర్వమే ఆయన వేసే ప్రతి అడుగులో కనిపించేది.

కానీ, హఠాత్తుగా వొక రోజు మిల్లు లాకౌట్ చేశారు. సమ్మె మొదలయింది. మా సోంబావ మాత్రం సమ్మెకి దూరం. ఆయన మేనేజ్‌మెంట్ పక్షం. సమ్మె చేసే కార్మికులు సోంబావని చెడ తిట్టేవాళ్ళు. ఆయన మాత్రం యింటిపట్టునే వుండేవాడు. మిల్లు యెప్పుడు తెరుస్తారా అని అసహనంగా యెదురుచూసేవాడు. నెలయింది. రెండు నెలలయింది. మిల్లు తెరవలేదు. సమ్మెకు రాజకీయ పార్టీల మద్దతు లభించింది. రేపో మాపో గవర్నమెంటు మిల్లు స్వాధీనం చేసుకుం



టుందంట. నెల్లూరులో మాదిరిగా కొ ఆపరేటివ మిల్లుగా మారుస్తుందంట అని అందరూ అను కోవడం ప్రారంభించారు. మా సోంబావకి భయం పట్టుకునింది. వొక రోజు సాయంత్రం సమ్మె శిబిరంలోకి వెళ్ళి కూర్చున్నాడు. యింకో వారం రోజులకి మిల్లు తెరిచారు. కానీ పాత కార్మికులతో కాదు. తమిళనాడునుంచి తీసుకువచ్చిన కొత్తవా ళ్ళతో మిల్లు నడిపించారు. పాతవాళ్ళు వాళ్లని అడ్డుకున్నారు. గొడవలు జరిగాయి. తలలు పగి లాయి. పోలీసు కేసులయ్యాయి. మా సోంబావ గొడవలకి దూరంగా వున్నాడు గానీ మిల్లులో మళ్ళీ పని దొరకలేదు. స్థానికులెవ్వరినీ మళ్ళీ పనిలోకి తీసుకోలేదు. మిల్లు కార్మికులంతా హఠా త్తుగా కూలీలుగా మారిపోయారు. మట్టి పనికీ, సేద్యం పనులకీ వెళ్ళేవారు. అందరితోపాటు మా సోంబావ, విజయమ్మ కూడా కూలిపనులకు వెళ్ళే వాళ్లు. కానీ వూళ్లో పనుల్లేవు. కార్మికులు పస్తులతో దారుణమైన అవస్థలు పడేవాళ్లు.

"అకా తిరేంగళం జూడకా పేట్లో బస్టాండు కాడ కనిపించివోళ్ళందరి ముందర చెయ్యి జాపి అడుక్కుంటూ వుండాడకా" అని వొకరోజు మా సోంబావ మా అమ్మ ముందు కళ్ళనీళ్లు పెట్టు కున్నాడు. తిరువేంగళం మా సోంబావతోపాటు మిల్లులో ఫిట్టరుగా పనిచేసేవాడు.

"సోమయ్యా.. నేనొక మాటంటా. యోచన జెయ్యి. పల్లోడికి వుట్టి యీ పనేంది అనుకోబాక. అమర్జోతి అని పారిన్ సొతు వొచ్చినాక మనూరి దేవాంగలీది కత యెట్టుండాదో తెలుసు గదా! వారానికి రొండు తూర్లు కుంటి సాయిబు కూరాకు కోస్తా వుండాడు. గెద్దలు తన్నకపోయి నట్టే గదా! కలర్ సోడాలేమి, పండ్ల బుట్టలేమి, చాపల గంపలేమి అంతా యిప్పుడు ఆ రొండీదులే గదా తిరగాడతా వుండాయి. వారం దినాలు కష్టపడితే రొండు నూర్లు అలాగ్గా చేతల్లో బడ తుండె. అగుమానం అనుకోబాక రఘురామయ్య కొటాయి కాడికి బొయ్యి నాల్దినాలు ఆయన చేతికింద నలిగినావంటే పని నేర్చుకోవచ్చు" అని ఆగి సోంబావ ముఖంలోకి దీక్షగా చూసి మా అమ్మ తిరిగి ప్రారంభించింది–

"దేవాంగల వుట్టక వుట్టలేదు గదా మనకి రాబోతాదా యీ పని అనుకోబాక. కష్టానికి పాలుమారనోడికి యే పనయినా అనావసిం గదా" అనింది.

మా సోంబావ మా అమ్మ మాటను చెవిన వేసు కున్నాడు. మూడు నెలలు తిరిగేసరికి యింట్లోనే సొంతంగా మగ్గం పట్టుకున్నాడు. రఘురామయ్య దగ్గర పడుగు తెచ్చుకుని కూలికి నేశాడు.

సంవత్సరం తిరిగేసరికి వూరింటిపక్కనే పాల వేసి రెండు మగ్గాలు పట్టాడు. వొకదాంట్లో తను దిగి నేసేవాడు. రెండోదాంట్లో కూలిచ్చి మనిషిని దింపాడు. విజయమ్మ రాట్నం పనీ, అచ్చు అతికే పనీ చేసేది. అన్నానికి లేసినవుడు, పని బడి బయటకు వెళ్ళినవుడు మా సోంబావ మగ్గంలో విజయమ్మ దిగేది.

బడొదలగానే నేను మా సోంబావ మొగ్గం కొటాయికి వెళ్ళేవాడిని. వూలు దూర్చే పని నాది. సోంబావకి కుడిపక్కన కూర్చుని పోగుల మధ్య నాడి దూరుస్తూ వుండాలి. విజయమ్మ పచ్చటి పసుప్పూసుకున్న ముఖం మీద నుదుటన రూపాయి బిళ్లంత బొట్టు పెట్టుకుని బుగ్గన వక్కాకు నములుతూ రెండు మగ్గాల మధ్య కూర్చుని కండెలు చుడుతూ మా సోంబావతో ముచ్చట్లాడేది. ఆ రోజుల్లో ఆ యింట్లో యెప్పుడూ యేదో వొక చిరుతిండి వుండేది. సోంబావ గుంట్లో దిగి నేస్తూ వుంటే గట్టుమీద కూర్చుని

కొసరి కొసరి తినిపించేది. పండ్లూ ఫలహారాలతో నవ్వులతో ఆ యిల్లు కళకళలాడుతూ వుండేది.

* * *

"అకా యింటిదాకా వొచ్చిపో" అనింది పరుగున వచ్చిన ఆయాసంతో విజయమ్మ.

ఆమె కళ్ళనిండా ఆందోళన.

వీధి తలుపు చిలుకుపెట్టి మా అమ్మ బయటకు నడిచింది. నేను ఆమె వెనుకే బయలుదేరాను.

నులక మంచంమీద మా సోంబావ వెల్లకిలా పడివున్నాడు. వొంటిమీద గుడ్డ సరిగా వున్నదీ లేనిదీ కూడా స్పృహ లేదు. మూలుగుతున్నాడు. గొణుగుతున్నాడు.

మా అమ్మ మంచం పట్టిమీద చెయ్యి ఆనించి వొంగి–

"రే... సోమయ్యా.. సోమా.. రే.." అని పిలుస్తూ చెంపలమీద చురుకు తగిలేలా తట్టింది.

సోంబావ కనురెప్పలు కష్టంగా పైకెత్తి చూసి నవ్వుముఖం పెట్టాడు. ఆ నవ్వు తుంటరిగానూ వెర్రితనంతోనూ నిండివుంది. అర్థంకాని అస్పష్ట పదాలేవో గొణుగుతూ పక్కకి తిరిగాడు. నోట్లోంచి తెల్లటి నురగలాగా ఎంగిలి ధారగా కారుతోంది. విజయమ్మ ముందుకువచ్చి లుంగీ సర్దింది.

"మే యెరగెడ్డొకటి తీసకరాబో" అని పని పురమాయించింది మా అమ్మ.

యెరగడ్డను సోంబావ పెదాల మధ్యనుంచి పళ్ళ దగ్గరకు నెట్టింది.

"సోమయ్యా.. రే.. దీన్నట్ట నవులు..." అంటూ పళ్ళను చేత్తో విడదీసి యెరగడ్డను లోపలికి తోసింది.

తువ్వూమని బయటకు వూసేశాడు. పళ్ళు బిగ బట్టేశాడు. వెర్రిగా నవ్వుతూ యేదేదో మాట్లాడడం ప్రారంభించాడు.

విజయమ్మ దుఃఖం కట్టలు తెంచుకునింది.

"అకా.. ఆ జాండ్రపేట గుంపు కదా యీ వాటావ జేసిపెట్టింది. వొంచిన తలెత్తకుండా మొగ్గం నేసుకునేవాడు. యెట్టయిపొయ్యాడో జూడు. గెంటసేపన్నా గుంట్లో దిగి నేస్తే గదా! పొగులని లా రేత్రనిలా పరంట పక్కే పనయిపొయింది. తాగేది. కచ్చేరి బడిలో చీట్లాడేది. అడిగితే యెట్టంటే అట్ట మాట్లాడేది. వాళ్ళ కాపరాల్లో నిప్పులు బడ. యెట్టాంటి మనిషిని యే గెతి బట్టించారో జూడు. వాళ్లు నాసినమైపోను. వాళ్ళని చెల్లెమ్మ యేట్లో బెట్ట..."

సోంబావ వొక్క వుదుటన పైకి లేశాడు. పంచె వూడి కింద పడిపోయింది. అరచేత్తో యీడ్చి విజయమ్మ ముఖం మీద బలంగా కొట్టాడు.

యీ హఠాత్ఘాతానికి ఆమె చుట్టు గుడిసె మొత్తమీద వెళ్ళి పడింది.

"కొట్టి సంపేస్తుండాడ్రా దేవుడో" అంటూ ఆమె పెద్దగా యేడుపు మొదలుపెట్టింది. చుట్టుపక్కల యిళ్ళవాళ్లు వచ్చి మూగారు.

సోంబావ కిందపడిన పంచెను తీసుకుని వుండగా నడుముకి చుట్టుకున్నాడు. రెండు అడుగులు తూలుతూ నడిచి వీధి తడిక మీద దబ్బున పడ్డాడు. గొణుగుతూ పడుతూ లేస్తూ వీధిలోకి నడిచాడు.

* * *

"నువ్వు నెల్లూరికి బొయినాక చానా కత జరిగిందిలేరా" అనింది మా అమ్మ ఆ కథంతా చెప్పడానికి సిద్ధపడుతూ.

మొత్త దగ్గరనుంచి లేసి వాకిట్లోకి వెళ్ళి ఆకాశంలోకి చూసింది. తిరిగివచ్చి తిన్నెను ఆనుకుని కింద కూర్చుని ప్రారంభించింది–

"ఆ దినాల్లో సోంగాడికి వూళ్లో యెంత మతింపు. సోంగాడు గూడా చిన్నా పెద్దా యెరిగి గదా మెసిల్నాడు. యెంత అణకువ. యింటికాడ తలొంచినాడంటే మిల్లు గేటు కాడే యింకన తల పైకెత్తేది. మళ్ళీ మిల్లు కాడ వొంచినాడంటే యింట్లోకి అడుగుపెట్టినాకే గదా పైకెత్తేది. అద్దరేత్రి అనిలా అపరేత్రి అనిలా యెవురికి యే అక్కరొచ్చినా యే ఆపదొచ్చినా నేనుండా అని వొచ్చేవాడు."

ఆమె కనుగుడ్ల మీద తొణికిసలాడిన చెమ్మ గతకాలపు తియ్యటి జ్ఞాపకాలను ప్రతిఫలించింది. ఆ అనుభూతిని ఆస్వాదిస్తున్నట్టుగా చూపును శూన్యంలో నిలిపి వొక్క నిమిషం మౌనం వహించింది. యింతలోనే ఆమె కనుబొమలు ముడుచుకున్నాయి. దుఃఖపు తెర యేదో ఆమె జ్ఞాపకాల పొరల్లోంచి వెలికివచ్చింది.

"యెదవ నాసినం మిల్లు– యెట్టాంటోడిని యే గెతికి తెచ్చింది" అనింది.

"మిల్లు పని పోతే పాయిందిబో. మొగుడూ పెళ్ళాలు మొగ్గం నేసుకుంటా కూటికి గుడ్డకి దిగుల్లేకుంటా బతికిపాయినారు గదా అనుకుంటే ఆ ముండమోపి అమర్జోతి సొతు నోటికాడ కూటిగిన్నె ల్లాగేసినే" అని ఆగి నావైపు జూసి– "చిన్నబయా నీకు గుర్తుకుండాదా సోమయ్య కొటాయిలో అమర్జోతి వూలేసేవాడివి" అనడిగింది.

గుర్తుందన్నట్టుగా నేను తల వూపాను.

"దేవాంగుల వొంటిమింద గుడ్డలా. కంటిమింద రెప్పలా. రేత్రీ పొగులూ నేసిందే నేసింది గదా! అమర్జోతి గిరాకి అట్టుణ్ణింది అప్పడు. మెడ్రాసులో కొండమాదిరిగా గుట్టబడి పాయినాయంట పావులు. పారినోళ్లు యింకీ గుడ్డ మాకొద్దురా సామీ అనేసినారంట. ఆ దెబ్బ చిన్నంగానా తగిలింది దేవాంగులకి. మొగ్గంమింద గుడ్డ నేస్తే కూలి గిట్టకపాయ. ముసిలీ ముతకా పిల్లా జెల్లా అందురూ సేద్దిం పనలకి మల్లుకుంటిరి. తొవ్వాటానికీ, సెనగ పెరుకుళ్ళకీ, మిరప కోతలకీ– యాడ జూసినా దేవాంగులే జేరుకుంటిరి. అయినా అన్ని కాలాల్లోనూ సేద్దిం పనులు చేతినిండికీ వుండేదానికి మనూళ్లో యేర్లూ కాలవలూ యేమన్నా పారతా వుండాయా? అబ్బ.. ఆ అవస్తలు కళ్లజూళ్ళేక పాయినాం అనుకో. ఆకిల్తో అల్లాడిపాయినారు. కుటుంబరాలు కుటుంబరాలుగా దేవాంగులు యిళ్లూ వాకిళ్లూ వొదిలేసి చీరాల పక్క మంచి గిరాకీ పనులుండాయని పాయినారు గదా. మిగిలిపాయిన ముసిలీ ముతకా మానం చంపుకోని వూళ్ళో బిచ్చం అడుక్కొని గదా పేణాలు నిలుపుకున్నారు."

"యిజియా సోమయ్యా గూడా దొరికినన్నాళ్లు కూలిపన్లకి పోతిరి. ఆ పిల్ల నిండు కడుపుతో వుంటే సోముడు మట్టి పనినిలా రాయి పనినిలా యే పని దొరికితే ఆ పని కంతా పాయినాడు. వొళ్ళు దాచుకోలా. కూలో నాలో జేసుకుంటా ఆయమ్మిని ముదిగారంగా గదా చూసుకున్నాడు. తొలి చూలు మొగబిడ్డని కనింది. కాన్పయిన నెల దినాలకే అనుకుంటా– యెర్రమట్టి దిబ్బల్లో మట్టి లోడతా వుంటే పెళ్ళ కూలిపొయ్యి సోంగాడి నడుము విరిగిపాయ. మూడునెల్లు మంచంలో పడుంటే నిండు బాలింతరాలు యిజియా గదా కోనేటి కట్టమింద బోండాలూ మురుకులూ కాల్చి సంపాయిచ్చి పెట్టింది" మా అమ్మ మాటలకు అడ్డు తగులుతూ మా వదిన వచ్చింది– "అతా వులు



సులో వుప్వ సరిపోయిందేమో జూడు" అంటూ.

మా వదిన చేతిలోని గంటిలోంచి అరచేతిలోకి వులుసు వంచుకుని వాలుకతో నాకి సరిపోయిందన్నట్టుగా తలూపింది. చేతిని చీరకి తుడుచుకుని తిరిగి ప్రారంభించింది.

"పొరికెదవల పొవాసం జేసి గగా వాడు కాపరం వాసివం జేసుకున్నాడు" అనింది.

"తాగేది. ఆ యమ్మిని చావబాదేది. చీట్లాడేది. యెదవయి పొయివాడు గదా" అని గొంతు తగ్గించి–

"అవ్వుడు మేకపోతోళ్ళ పిల్ల వొకదాన్ని గూడా పెట్టుకోమణ్ణాడ్దే" అనింది.

"ఆయమ్మ యేందో మందు బెట్టేసిందంట. పెళ్ళాంలా, బిడ్డలా ఆ పిల్ల ఎనకాల్నే తిరగలాడేది. ఆనేక ఆయమ్మ యింకెవుడితోనో యెల్లిపొయిందంట. మళ్ళ అవ్వడొచ్చిపడ్డాడు యింట్లో" అనింది వాకిట్లో నీళ్లు చల్లి సందముగ్గు బెడుతున్న మా వదినని చూస్తూ.

"ముగ్గుపిండి అయిపొయిల్ళా. రేవు అన్నాల్దిన్నాక యేటికి బొయి తెల్లసిక దెచ్చుకోని కలువుకోవాల" అనింది మా వదినతో.

మా వదిన పైట కొంగుకి చేతులు తుడుచుకుంటూ అడిగింది. "అతా.. వుండూళ్ళో పొంతిల్లు బెట్టుకోని ఆరువుగా యిడ్లీలో దోసిలో పోసుకోని బతక్క యీడెందుకొచ్చి చేరినట్టు"

"యెందుకంటే... బతకదామని గదా. వూరొదిలేస్తేనన్న బాగుపడ్తాడని ఆయమ్మ ఆశ" అనింది మా అమ్మ.

"తో... యీడ జేరిన తొలివాళ్ళలో మరీ యింతిదిగా లేరతా. ఆ యన్న టీ యేసేవోడు. ఆ యక్క వాస్టా గాల్చేది. సందేళయితే అంగిడి మూసేసి యిద్దురూ పిండి రుబ్బతా కనిపించేవోళ్ళు" అని చెప్పింది మా వదిన.

"కుక్క తోకని యెంత సాగదీస్తే మాత్రం వంకర తీరతాదా" అని మా అమ్మ నావైపు తిరిగి మాటలు కొనసాగించింది.

"కాపర మన్నాక మాటా మాటా అనుకోకుండా మొగుడూ పెళ్ళాలనేవాళ్ళు వుండరు. కానీ యిదేం పాడో గానీ యీ మొగుడూ పెళ్ళాలు వొక కప్పకింద కలిసి కాపరం జేస్తానే వుంటారు. శత్రువుల మాదిరిగా కలబడి కొట్టుకుంటావే వుంటారు"

"కొట్టుకుంటా వుంటారంటే మామూలుగానా, ఆ యక్కని వంగవబెట్టి యెట్ట బాదతాడని" అనింది మా వదిన చీత్కారంగా.

యీ మాటలన్నీ వింటుంటే నాకు మా పోంబావ మీద చెప్పరాని అసహ్యం కలుగుతూ వుంది.

"వొక దినం యేం జేసివాడా... యిట్నే ఆ యమ్మని కొట్టాడా. ఆ యమ్మ తిరుక్కుని రెండు పీకింది. అంతే అగుమానం అయిపొయింది యీ మొగోడికి. రైలు కిందబడి చస్తా అనేసి పొయ్యాడు"

"పడి నచ్చినా పొయుండేది పీడ" అనింది మా వదిన కోపంగా.

"చిన్నోడా.. దినమ్మా మాదిరిగానే బజార్లో యీ పక్క ఆ పక్క తిరిగేసి యెవురో వొకర్ని వాల్రూపొయిలడిగి పొరాయి తాగేసి రాబోతాడ్లే అనుకునింది ఆ యమ్మ. అయితే చక్కాపొయినోడు యేం జేసినాడా... వేరుగా పొయ్యి కోటపోలూరు గెరండాల దెగ్గిర రైలుకింద చేతులు పెట్టేసినాడు. రొండు చేతులూ మణికట్ల దాకా తెగట్టవతల పడిపొయినాయి."

హఠాత్తుగా వొక చీకటి తెర నా కళ్ళముందు వాలింది.

నా సమస్త శరీరంలోనూ వొక పెద్ద కుదువు.

'అయ్యో' అన్నాను వెంటనే.

"అయ్యో అంటే పాపం ఆ యెదవకి" అనింది మా అమ్మ అందుకుని.

నాలో మా పోంబావ మీద పేరుకున్న అసహ్యమంతా కరిగిపోయింది. కరుణతో నా మనసంతా నిండిపొయింది. అవిటివాడని కూడా లేకుండా మా అమ్మ కోపంగా మాట్లాడడం నాకు నచ్చలేదు. నా అసంతృప్తిని పసిగట్టినట్టుగా ఆమె మాటలు కొనసాగించింది.

"యింకవ జూడు ఆ యమ్మ బాదలు. ఆ నెత్తురు ముద్దని మెద్రాసు జెనలాస్పత్రికి యేస్కొనిబొయింది. ఆడ యెవురి కాళ్లు బట్టుకునిందో యెట్ట జేసిందో యే కష్టాలు బడిందో యేమో గాని మూడునెల్లు కంటికి రెప్ప మాదిరిగా కాపాడుకు


*HAPPY AND PROSPEROUS DIWALI GREETINGS TO ALL..............*

For Passports and all International
Flight Tickets Especially for U.S.A.

Please Contact:

**OM TOURS & TRAVELS**

**HEAD OFFICE:**
3-6-14/3/4, Himayatnagar,
Liberty Road,
Hyderabad - 500 029
Tel: 3222930, 3222358, 3222362
Grams: TOURSWELL
Fax: 040-3228004

**BRANCH OFFICE:**
29-37-80,
Eluru Road,
Opp: Vijaya Talkies,
VIJAYAWADA-520 002
Tel: 435415

నింది. పేణాల్లేని కట్టెని గదా ఆస్పత్రికి యేసుకోని బొయింది. మళ్ళ మనిషిని జేసి తొడుకోనొచ్చింది"

"కాపాడుకునింది కానీ. కొరివి నెత్తిన బెట్టుకున్నట్టే గదా! అవిటి మొగుడికి సేవలు జేసునా. టీ యంగడి జూసుకుణ్ణా" అనింది మా వదిన. ఆమె మాటల్లో విజయమ్మ పట్ల అంతులేని సానుభూతి వుంది.

"అవును.. మొండి చేతులేసుకోని ఆ యెదవేమో గెట్టుమింద పెదరెడ్డాల కుచ్చోనుండె. ఆ యమ్మ కష్టం జూళ్ళేక పోతుండాం అనుకో. ఆ మనిషికి పంచె గట్టాల. చొక్కాయి యెయ్యాల. బీడీ కాల్చి నోట్లో బెట్టాల. అడ్డాల బిడ్డని జూసుకున్నట్టే గదా. ఆకరికి ఆ మనిషికి గుద్ద గడిగే పని గూడా ఆ యమ్మే జేసునే" అనింది మా అమ్మ విచారంగా.

"కష్టమో నష్టమో పడి పెడతా వుండాది గదా. తిని పడుంటే యేమి" అనింది మా వదిన.

"బెంచీమీద కుచ్చునేది. కారుకూతలు కూసేది. ఆ యమ్మ తిరిగి వొక మాటంటే సాలు. చేతుల్లేవు గదా. కాళ్ళతో యెగిసెగిసి తన్నేది"

"కాళ్ళతోనా... తంతాడా" అని గొణిగాను నమ్మలేనట్టుగా.

"యేషాలు గానీ.. యెందుకాయమ్మ యీ మనిషి దెగ్గిర యింకా పడుండేది. వొళ్ళు హూనం జేసుకుని సంపాయిచ్చి పెట్టేదెందుకు. చావతన్నులు తినేదెందుకు. యాడయినా బిడ్డల్ని బెట్టుకోని అరువుగా ఆయమ్మ బతుకు ఆయమ్మ బతకచ్చునే" అనింది మా వదిన విసుగ్గా.

ఆమె మాటలు కరెక్టే కదా అన్నట్టుగా నేనూ తలూపుతూ మా అమ్మవైపు చూశాను.

ఆమె ముఖంలో కనిపించీ కనిపించని చిరునవ్వు క్షణకాలం మెరిసి మాయమైంది. ఆ నవ్వులో మా ఇద్దరి పట్లా యెంతో జాలి వుంది.

* * *

సాల ముందుకు రాగానే నా నడక వేగం తగ్గిపోయింది. తల తిప్పి చూశాను. టీ బయిలర్ వెనుక నుంచి విజయమ్మ నన్ను చూసింది.

"అబయా... యెవ్వడా రావడం" అంటూ బయటకు వచ్చింది.

అక్కడే నిలబడ్డాను.

"దినామూ అమ్మని అడగతానే వుంటా. బాగుండావా. అన్నదమ్ముళ్ళు అప్పజెల్లెళ్ళు అందురూ యీణ్ణే వుంటే, నువ్వొక్కడివీ దూరాబారాం బోతివి" అనింది.

చిరునవ్వుతో తలవూపి ఆమె ముఖంలోకి చూశాను, నిన్న సాయంత్రం నాటి బీభత్స చిహ్నాలేమైనా కనిపిస్తాయేమో అని.

తేటగా, హాయిగా వుంది ఆమె ముఖం.

"యీ తూరన్నా పప్పన్న బెడ్తుండావా లేదా" అని అడిగింది.

నేను నవ్వి. "పిలకాయలు బాగుండారు కా" అనడిగాను సాలలోకి చూస్తూ. లోపల చీకటిగా వుంది.

"అగ్గో... లోపల పాణికోమండాడు మీ బావ" అని సాలలోకి తొంగిచూసి– "యేం బా... యీడె వురొచ్చుండారో జూడు" అని అరిచింది.

నా గుండె వేగం పెరిగింది.

రెండు చేతులకీ కట్లుతో మా సోంబావ బయటకు వచ్చాడు. భుజాల చుట్టూ యెర్రటి టవలు కప్పకుని వున్నాడు. పెరిగిన గడ్డం. పైకి కట్టిన మాసిన లుంగీ. పీల వొళ్ళు. నేను మగ్గం కొటాయిలో చూసిన సోంబావ కాదు యితను.

"బాగుండావా" అన్నాడు పలకరింపుగా.

"బాగుండాను బావా" అన్నాను. కొనసాగించడానికి మాటలేవీ దొరకలేదు. కానీ చాలా మాట్లాడాలని వుంది.

"వూరిదాకా పోతుండా. సాయంకాలం వస్తాను బావా.. వస్తా కా.." అనేసి గబగబా ముందుకు కదిలాను.

ఆ సాయంత్రం నేరుగా టీ యంగడిలోకి వెళ్ళాను.

బెంచీ మీద మా సోంబావ వొక్కడే కూర్చుని వున్నాడు.

"రా.. అబయా" అన్నాడు నన్ను చూసి.

"అక్కేదా" అని అడిగాను.

"బజార్దాకా పోయింది" అన్నాడు బెంచీ మీద పక్కకి జరిగి.

పక్కనే కూర్చున్నాను.

"యిజియా గూడ లేకపాయినే. కాఫీ అన్నా బెట్టిచ్చేదానికి" అన్నాడు.

భుజం మీదనుంచి జారిన టవలును నోటితో సర్దుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. నేను టవలు తీసి భుజాలచుట్టూ కప్పాను.

"యేంది బావా యీ పనా?" అన్నాను.

కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత "రాత" అన్నాడు. అతని కళ్ళనిండా నీళ్ళు.

ఆ తర్వాత సంభాషణ కొనసాగలేదు.

"మళ్ళొస్తా బావా" అని లేశాను.

"నాల్దినాలుంటావా" అని అడిగాడు.

"ఆ" అని బయటకు నడిచాను, చాలా అసంతృప్తిగా.

మరునటి రోజు సాయంత్రం మళ్ళీ టీ అంగడి దగ్గరకు వెళ్ళాను.

విజయమ్మ పప్పు రుబ్బుతూ వుంది.

మా సోంబావ అలికిడి లేదు.

"బావేడీ" అనడిగాను, లేకపోతే బావుణ్ణు అనుకుంటూ.

"యింకేడికి బోతాడు. నొప్పి తాళలేకుండా వుండాదిమే... అని పదైదు రూపాయిలు పెరక్కొని బొయినాడు సారా యంగిడికి" అనింది నవ్వుతూ.

"యింకా తాగతానే వుండాడా యిట్ట బెట్టుకోని చేతులు" అన్నాను.

"పెళ్ళాం బిడ్డలు లేకపాయినా అదుంటే చాలు ఆ మనిషికి" అనింది రోలు పక్కనే వున్న నీళ్ళ దబరలో రెండు చేతులూ ముంచి కడుక్కుంటూ.

పైట కొంగుతో చేతులు తుడుచుకుని లేచి బయిలర్ దగ్గరకు వెళ్ళింది. కొళాయి తిప్పి వేడినీళ్ళతో గ్లాసు కడిగి కాఫీ కలిపి నా చేతికి యిచ్చింది.

నేను వొక గుక్కతాగి అన్నాను.

"అకా వొక మాటడగతా యేమనుకోవు గదా"

"అడుగబయా" అనింది.


"నీ కష్టం నువు జేసుకుంటుండావు. నీ కూడు నువ్వు తింటావుండావు. యింతజేసి ఆ మనిషి దెగ్గిర యీ దెబ్బలు తినేదెందుకు? యాడ టీ యంగడి బెట్టుకున్నా నీ మావాన నువ్వు సుకంగా బతికిపోవచ్చు గదా, నీబిడ్డల్ని బెట్టుకోని" అని అడిగాను.

నా ప్రశ్న వెనుక నిజాయితీని పరీక్షిస్తున్నట్టుగా ఆమె నా ముఖంలోకి చూసింది. వొక నిర్ధారణకు వచ్చినట్టుగా నిట్టాడి గుంజకు జారిగిలబడి పేడ అలికిన నేలమీద కూర్చునింది.

"నిజమే నబయా" అనింది.

కొన్ని క్షణాల విరామం తర్వాత మొదలుపెట్టింది.

"నిజమే.. నా బతుకు నేను బతకచ్చు. గొడ్డు కన్నా యీనంగా గదా చాకిరి చేస్తా వుండాను.



నా రెక్కల కష్టం నేను బడతా వుండాను. నా కూడు నేను తింటా వుండాను. అయినా యీ కారుకూతలు యేమిటికి పడాల. యీ సావుదెబ్బలు యేమిటికి తినాల. ఛా.. యెదవ జల్మ అనుకుంటావుంటా. యే యేట్లోనన్నా పడి సస్తే యింకీ బాదలుండవు గదా అనిపిస్తా వుంటాది. అబయా... సస్తే సుకంగానే వుణ్ణు నాకు. అనేక నా యిద్దురు బిడ్ల గతేం గావాల? యే కోనేట్లోనన్నా వాళ్ళని గూడా ముంచేసి గదా నేను దూకాల" అని ఆగింది.

భయ విహ్వలమైన భావం ఆమె ముఖంలో కదలాడింది. ఆ ఆలోచనని కూడా యింక యెక్కువ సేపు భరించలేనట్టుగా వెంటనే అనింది–

"నావల్ల గాదు సామీ. బూమ్మీద అరువుగా బతుక్కోపొండి అనిగదా దేముడనేవాడు నా కదువున ఆ యిద్దురు బిడ్డల్ని యేసుంటాడు. యేం పాపం జేసినారని వాళ్ళ పేణాలు తియ్యాల. నా వల్ల గాదబయా. అంత పాశాణం గాదు నేను" అని తల అడ్డంగా వూపింది.

"కూటికా, గుడ్డకా... కొరగాని మనిషి. తుట్టమారుగా చేతుల్లేనోడు. యింకన యేనాటికైనా వొకరికి బరువేగానీ వొకరికింత బెట్టే గెతి లేనోడు. యెందుకీ బాదలు పడాల వోడితో? వాడి వొంటికి సుకం యిచ్చేది. మల్ల వాడి దెగ్గిర పడదెబ్బలు తినేది. కడంతదాకా యిదే బతుకా.. ఛా! కష్టానికి పాలుమారని మనిషిని. నా యిద్దురు బిడ్డల్ని బెట్టుకోని యాడైనా అరువుగా బతికిపోవచ్చునే. -యీ వాటంగానే అనుకుంటా నేను గూడా నావా తూర్లు. కావబయా... మొగుణ్ణొదిలేసిన ఆడకూతురు వొంటిగా బతికేట్టుండాదా యీ కలిగ్గంలో. పెద్దింటి ఆడది మొగుణ్ణొదిలేసినా. ముండమోసినా, నలుగురికి కొంగుబరిచినా సాగతాదిగానీ పేదరాలికి సాగతాదా. కాకులు గెద్దల మాదిర్లో గదా పొడిచి పొడిచి సంపేది. నా కష్టం నేను జేసుకుంటా నా కూడు నేను తింటే ఏమాత్రం అయ్యో అని వొదిలెయ్యబోతుండారా యీ మొగనాబట్టలు. ఆడది అగ్గవగా దొరికిందనేసి కుక్కల మాదిర్తో చుట్టుకోరా. వొంటిగా బతికే ఆడకూతుర్ని లంజిని చేసేదాకా నిద్రబట్టబోతాదా యీ కోలమిట్ట నాబట్టలకి. అనేక నా గెతేం గావాల, నా బిడ్డలేం గావాల."

"బతకలేకనే గదా యీదిన బడి టీ యంగడి బెట్టుకునింది. ముక్కాల్రూపాయి బెట్టి టీ దాగడానికొచ్చే ప్రెతి నా ముట్టిపాతకీ నాతో యాసండాలేనయిపాయ. నా మొగుడు చాతగానోడని అలుసు గదా!"

"కొంపాగోడూ నువ్వు సారా యంగిడికి దారబోస్తివి. యింకెట్ట బతికేది? రోడ్డున బడితిమి. యింకన యివ్వుడు బట్టుకోని– నువ్వు వోడితో మాట్లాడగూడ్దు. యీడితో మాట్లాడగూడ్దు అంటే యెట్ట జరగతాది? తీరుగా తలకి సవురు బెట్టుకోని జడేసుకుంటే తిడితివి. మంచి గుడ్డగట్టుకుంటే అనరాని మాటలంటివి. అంగిడన్నాక మనిషీ మాకూ రారా మంచీ సెబ్బరా మాట్లాడకనే వుంటామా. ప్రెతిదీ అనువానమే నయిపాయ. యెట్ట యేగేది? మనమేమన్నా నడిబజార్లో అద్దాల వోటలు బెట్టుకోనుండామా, కాలుమింద కాలేసుకుని కూకున్నా జరిగేదానికి! యీ కోలమిట్టలో యీ వరికే నాలుగు టీ యంగళ్ళుండాయి గదా. మనం బెట్టీబెట్టక తాలికే యాపారం యాణ్ణించి జరగతాది? నవ్వు మాటనో, నడ్డికులికో మనుషుల్ని రాబట్టాల గదా! ఆ మనిషి మాదిరిగా మొహం కందగెడ్డాల బెట్టుకోని కూకోనుంటే యీ వరికి యాపారం యెవ్వడో యేట్లో గలిసి పాయుణ్ణు. దైర్నంచేసి మొగోడి మాదిర్తో నిలబడబట్టిగదా కదుపుకింత తింటావుండేది. ఆదంతా యోచన జెయ్యాల్నా లేదా?"




"ఆ కాడికీ కోపం పట్టలేక వొంగనబెట్టి బాదతానే వుంటివే. యింతలేకే యేం గోరం జరిగిపోయిందనేసి యీ పని జేసింది? రొండు చేతులూ యెత్తక బొయ్యి రైలు కింద బెడ్తివే..."

దుఃఖంతో ఆమె మాటలు తడబడ్డాయి.

"నన్ను సాదించి సంపకదినే దానిగ్గదా యీ పని జేసింది" అని భోరున యేడ్చేసింది. గోడపక్కకి వంగి బుర్రున ముక్కు చీదింది. బొడ్డులోంచి పైటకొంగు బయటకు లాగి ముక్కు తుడుచుకుని అనింది–

"కాలూ ముక్కూ సక్కరంగా వుండే ఆడిది టీ యేస్తావుండాదనే గదా యీ మొగనాబట్టలంతా యెగబట్టుకోని యీడదాకా వస్తావుండేది. వొచ్చిన్నా బట్టలు గొమ్మున టీ తాగేసి బోతారా. ఆ మాట యీ మాట మాట్లాడ్తారు గదా! వాళ్ళు నాలుగు మాటలు మాట్లాడ్తే నేనొక్క మాటన్నా మాట్లాడాల్నా లేదా? నాకేమన్నా రందిబట్టి వాళ్ళతో చెతుర్లాడతానా? నవ్వతా మాట్లాడిన ప్రెతి నాబట్టకీ కొంగుబరస్తానా? మానం జంపుకొని గదా బతకతా వుండేది."

మాటలు ఆపి బొడ్లో నుంచి ముక్కుపొడి పొట్లం బయటకు తీసింది. చిటికెడు ముక్కుపొడి తీసుకుని గోడవైపుకి తిరిగి నోట్లో దోపింది. చూపుడు వేలుతో పళ్ళు తోముతున్నట్టుగా పక్క పళ్ళకు ముక్కుపొడి రుద్ది చీరకి వేళ్ళు తుడుచుకుంటూ నావైపు తిరిగింది.

"అబయా.. మంచో సెబ్బరో కాయకష్టం జేస్తా వుండా. మరింకేమిటికి మాటలు బడాల. దెబ్బలు తినాల? నేను గూడా తగ్గడంలా. నన్నొక మాటంటే తిరిగి రొండు మాటలంటా. వొక దెబ్బ గొడితే తిరిగి వొకటి పీకతావుండా. యిట్టుండబట్టి గదా ఆ మనిషి అంతమాత్రమన్నా వుండాడు" అనింది విజయమ్మ వాకిట్లోకి తొంగిచూస్తూ.

బయట వెలుగు మందగిస్తూ వుంది. లేచి గూట్లో నుంచి దీపంబుడ్డీ అగ్గిపెట్టి తెచ్చి కింద కూర్చునింది. గోడ వారనుంచి ముగ్గుపిండి డబ్బా ముందుకి లాక్కునింది. బుడ్డీ నుంచి గ్లాసు బయటకుతీసి ముగ్గుపిండి లోపల వేసి తుడిచింది. ముగ్గుపిండి తిరిగి డబ్బాలో పోసి వొత్తి నలిపి వెలిగించి గ్లాసు పెట్టింది.

సందె మసక సాయంత్రాన పసుప్పచ్చటి ఆ దీపపు కాంతి ఆ టీ యంగడి గుడిసె లోపలంతా పరుచుకునింది. యింతదాకా దుఃఖంతో, బాధతో, కోపంతో నిండిని ఆమె ముఖం యిప్పుడా పచ్చటి కాంతిలో తేటగా వుంది.

దీపం బుడ్డీని గూట్లోపెట్టి మళ్ళీ తన పాత చోటుకి వచ్చి కూర్చునింది.

"యీ మనిషి యిప్పుడీ మాదిరిగా వుండాడుగానీ ఆ వరకి యిట్టుండునా... నీకు గెవనం వుండాదో లేదో... అమ్మనడుగు చెబ్తాది. నువ్వప్పుడు యింత పిలగోడివి. అయిస్కూలు బడికి పొయ్యేవోడివి. సందేళ బడొదిలి బెడ్తానే మా యింటికాడ్నే తారకలాడ్తా వుండేవాడివి" అని ఆగి నా ముఖంలోకి చూసింది.

సంతోషకరమైన ఆ జ్ఞాపకాలేవీ మరిచిపోలేదన్నట్టుగా చిరునవ్వుతో తల వూపాను.

"మీ బావని అప్పుడు గదా జూడాల. మిల్లులో పనిజేసే దినాల్లో యెంత మప్పితంగా వుండేవాడనీ! వొక చుట్టాలు పక్కాలు వొచ్చినా, వొకరింటికి బొయినా యెంత మర్యేద! యెవురికే ఆపదొచ్చినా అక్కరగా వుండేవాడు. మా పెళ్ళయిన కొత్తల్లో వొకతూరి కాళంగి యేటికి యెల్ల వొచ్చింది. వూరు నడిసవుద్రంలో వున్నట్టే గదా! యేపక్క జూసినా నీళ్ళే. తోటల మిందంతా యెల్లవ పారతా వుండాది.

ోటల్లో యిళ్ళు గట్టుకో నుండేవాళ్ళు యేమయి పాయినారో అని వూళ్ళో అందురూ బయింతో ఆ దిక్కే చూస్తా వుండారు. అప్పుడు మున్సీబు, మీ నాయిన, యింకా వూళ్ళో పెద్దోళ్ళందురూ కలిసి వొక అయిడీ యేశారు. కాళీ కిరసనాయిలు పీపాలన్నీ దెచ్చి తెప్పగట్నారు. ఆ యెల్లవ యిసురులో తెప్పమింద బొయ్యి తోటల్లో వుండే వాళ్ళని తొడుకోని రావాల. యెల్లవ జోరు జూస్తే బయిమేస్తా వుండాది. అప్పుడీ మనిషి గదా ముందూ యెనకా జూడకుండా యెదురుగెడ బట్టుకోని తెప్పెక్కినాడు. యింకో యిద్దర్ని యెక్కించుకోని బొయ్యి తోటల్లో ప్రేణాలరి చేతుల్లో బెట్టుకోని యిళ్ళమీద కూకోనుండే వాళ్ళనంతా యెక్కించుకొని గెట్టున జేర్చాడు. వూరు వూరంతా ఆ దినం యెట్ట జూసిందని మీ బావని..."

విజయమ్మ రెండు కళ్ళూ రెండు పచ్చటి దీపాలయ్యాయి. ఆమె నాపైపు చూసి మాట్లాడుతున్న దేగానీ నన్ను చూడడం లేదు. అపురూపమైన ఆ దృశ్యమంతా నా వెనుక యెక్కడో ఆమెకు కనిపిస్తున్నట్టుగా వుంది. మౌనంగా కొంతసేపు ఆమె దాన్ని ఆస్వాదించింది. వొక దీర్ఘ నిట్టూర్పుతో అందులోనుంచి బయటకు వచ్చింది.

"అబయా... మిల్లు పని యేమనంటా పాయిందోగానీ ఆ కాణ్ణించే గదా యీ మనిషికి సెని జుట్టుకోనుండేది. సోమయ్య పనిలో మొనగాడంటిరి. మిల్లులో యే మిషినికి యే రిపోరొచ్చినా యే రేత్రయినా పరుగులమింద పొయ్యి పనిజేస్తావుణ్ణె, అట్టాంటోడిని కనికరమన్నా లేకుండా పన్లోనుంచి తీసేస్తిరే.. వాళ్ళు నాసినమయిపోను. అక్కణ్ణించే గదా మనిషి మనిషిలో లేకుండా బొయినాడు. యింకవ బతకాల గదా అజ్జెప్పి కూలీ నాలీ జేసె. కులంగాని పవని అనుకోకుండా దేవాంగుల్తో సమానంగా మొగ్గం వేసె. బాగుపడ్డాం గదా అనకుంటా వుండేలోకే ఆ అమర్జోతి సౌతు.. దాన్నోట్లో మట్టిబడా... నిండా ముంచేసి బొయినే. యెంత



కని తట్టుకునేది. యీ బాదలకి తాళలేక తాగుడుకి తగులుకునేసినాడు. తాగుడుతోపాట్నే పోరికి సావాసాలు మరిగినాడు. యింకవ బాగుబడేదేడ? మొగ్గం పని బొయినాక మట్టిపనికి బోతే నడుము లిరిగిపాయ. వొళ్ళు దాపెట్టుకోకుండా కష్టంజేస్తే మటుకు యేం సుకం.. బతకలేకనే పాయనే. యెంత మనిషి కన్నా యింక మతిజెడకుండా వుంటాదా? ఆ వరికి నన్ను యెంగటగిరి రాణి మాదిర్తో ముదిగారంగా జూసుకునే మనిషే యీ వాటంగా మారిపోయినాడంటే ఆ తప్పు యీ మనిషిదా, యీ మనిషి బడ్డ కష్టాలదా?"

పిడుగులాంటి ప్రశ్నవేసి కొన్ని క్షణాలు మౌనంగా వుండిపోయింది. నా నుంచి యే సమాధానం కోసమూ యెదురు చూడకుండానే తిరిగి కొనసాగించింది.

"మైండు నిండా చెడిపొయ్యిగదా యీ మనిషి యీ మాదిర్తో జేస్తా వుండేది. యిప్పుడా మనిషిని తప్పుబట్టి యేం పలం? యింకనిపుడు ఆ మనిషి మానాన ఆ మనిషిని వొదిలేసి నా దారి నేను జూసుకుంటే న్యాయంగా వుణ్ణా! రెక్కలు రాని బిడ్డల్ని కోడిపెట్ట రెక్కల కింద పొదుక్కున్నే గానీ వొదిలేసి దాని తిండి అది యెతుక్కుంటా బోతాదా? చేతుల్లేని యీ మనిషి పసిబిడ్డతో సమానం గదా"

వొక్క క్షణం ఆగి– "అవునంటావా, కాదంటావా" అని అడిగింది.

ఆమె మాటల ధాటికి దిమ్మెరపోయి యే సమాధానమూ చెప్పకుండా ఆమెనే చూస్తున్నాను. నా పరిస్థితిని అర్థం చేసుకున్నట్టుగా ఆమె అనింది.

"చిన్నబయా... యింతజేసినా ఆ మనిషిని జూస్తే బాద కలుగునేగానీ కోపం రాకపాయ. దినమ్ము తిట్టేది. తన్నేది. మల్ల కొంచేపిటికి 'యిజియా' అంటా కావులించుకొని బోరోమని పసిబిడ్డాల యేడ్చేసేది. పిచ్చెదవ."

ఆమె కళ్ళనిండా తడి. ఆమె గొంతునిండా అతని పట్ల అవ్యాజమైన అనురాగం తొణికిసలాడాయి.

*


స్థాపితం 1980

**ది కాకినాడ కో- ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్**

ఫోన్ : 78427

బ్రాంచీలు : 1. హెడ్డాఫీస్ బ్రాంచి, రామారావుపేట, ఫోన్ : 78427 2. మెయిన్‌రోడ్ బ్రాంచి, ఫోన్ : 75918, 3. సాంబమూర్తినగర్ బ్రాంచి, ఫోన్ : 71635 4. జగన్నాయక్‌పూర్ బ్రాంచి, ఫోన్ : 76898, 5. ఇంద్రపాలెం బ్రాంచి, 76716, 6. సర్పవరం జంక్షన్, బ్రాంచి 73348 7. సామర్లకోట బ్రాంచి, ఫోన్ : 27885

| డిపాజిట్లపై వడ్డీరేట్లు | |
|---|---|
| 30 రోజులు నుండి ఒక సంవత్సరము వరకు | 8.5% |
| 1 సంవత్సరం పైబడి 2 సంవత్సరముల లోపు | 12.5% |
| 2 సంవత్సరములపైబడి 3 సంవత్సరములలోపు | 14% |
| 3సంవత్సరములు మరియు ఆపైన | 15% |

అన్నిరకముల డిపాజిట్లపై వాణిజ్యబ్యాంకులు కంటే హెచ్చు వడ్డీ ఇవ్వబడును.

| 30-09-97 వ తేదీకి | |
|---|---|
| షేరుధనము | రూ. 70,39,000 |
| డిపాజిట్లు | రూ. 22,40,42,000 |
| అప్పులు | రూ. 12,77,27,000 |
| బ్యాంకు కల్పించు ఋణసౌకర్యములు | |
| నూతన గృహనిర్మాణము | 3,00,000 |
| యింటి మరమ్మత్తులు | 1,00,000 |
| చిన్నవ్యాపారం | 50,000 |
| జామీను అప్పులు | 5,000 |

గౌడన్లు, నర్సింగ్‌హోమ్స్, షాపింగ్ కాంప్లెక్స్, స్కూల్స్ వగైరా కట్టడములకు 10,00,000 వ్యవసాయదారులకు ట్రాక్టరు కొనుగోలుకు 3,00,000, వాహనములు, టివిలు, రిఫ్రిజిరేటర్లు మరియు ఇతర వినియోగవస్తువులు కొనుగోలుకు వస్తువువిలువలో 75%, బంగారు నగలపై రూ. 1,00,000 వరకు తక్షణ ఋణసౌకర్యము.

**యం.బి. చౌదరి**
డిప్యూటీ రిజిస్ట్రార్ / సెక్రటరీ

**బి.వి. రాయణం**
ప్రెసిడెంట్

SARADA, SAMALKOTA.